క్లుప్తంగా

కన్నుల పండువగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



పాత గుంటూరు: మల్లారెడ్డినగర్ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో ఆలయ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం శ్రీ సుబ్రహ్మణ్యస్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు శివకుమార శర్మ, చంద్రశేఖరశర్మ మంత్రార్థాలను వివరిస్తూ భక్తిశ్రద్ధలతో కల్యాణాన్ని నిర్వహించారు. విశేష హారతి, మంత్రపుష్పం అనంతరం కల్యాణంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. అన్నదాన కమిటీ అధ్యక్షుడు గుంటూరు వేమారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

హైజంపర్ మొహిద్దీన్‌కు ఆర్థిక సాయం



గుంటూరు (క్రీడలు): ఇటీవల జాతీయ స్థాయి కాంస్య పతకం సాధించిన హై జంపర్ మొహిద్దీన్‌కు సహస్ర ఆర్థో, న్యూరో హాస్పిటల్ అధినేత డాక్టర్ ఎం.శివకుమార్ బుధవారం రూ.23 వేలు అందజేశారు. ఈ మేరకు అథ్లెటిక్ కోచ్ జి.వి.ఎస్. ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొహిద్దీన్‌లో అద్భుత ప్రతిభ ఉందని, దాతల సహాయం చేయాలని ఆయన కోరారు.

ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌కు సహకారం

అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి

గుంటూరు: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌కు పూర్తి సహాయ సహకారాలందిస్తామని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు తెలిపారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని డీపీవో కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి ఆర్.కేశవరెడ్డి వినతిపత్రం అందజేశారు. అనంతరం జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ పేరును ప్రథమ పౌరుడని శిలాఫలకంపై వేయించాలని ప్రభుత్వాన్ని కోరారు. అయితే. ఇటీవల గ్రామ పంచాయితీలకు వచ్చిన ఆదేశాలలో తమ పేరును చేర్చకపోవడం శోచనీయమన్నారు. డైరెక్ట్ ఎన్నికల్లో విజయం సాధించే సర్పంచ్‌కు రాజ్యాంగంలో ప్రత్యేక అధికారాల్ని అందించారని చెప్పారు. ప్రొటోకాల్ ప్రకారం తమ పేరును శిలాఫలకంపై ఉండాలని ఆయన తెలిపారు. జిల్లా సర్పంచుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ముప్పాళ్ల మనోహర్ పాల్గొన్నారు.

వన మహోత్సవంలో భాగస్వాములు కావాలి



గుంటూరు ఎడ్యుకేషన్: నా దేశం–నా మట్టి నినాదంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం జేకేసీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో విద్యార్థులు సమ్మర్‌పేట రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ. నాగేశ్వరరావు మాట్లాడుతూ మొక్కల్ని పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు కాలుష్యాన్ని నివారించవచ్చని తెలిపారు. వన మహోత్సవంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కళాశాల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు దేశభక్తిని కలిగి, సామాజిక సేవా కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనాలని తెలిపారు. ఈ సందర్భంగా స్వర్ణభారతీనగర్ కౌన్సిలర్ స్మితా పద్మజ విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి. గోపీచంద్, ఎన్ఎస్ఎస్ అధికారులు డి. రాహుల్, చరణ్ చౌదరి, ఎల్. అజయ్‌బాబు, స్వర్ణభారతీనగర్ గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కావడి రథోత్సవం

పాత గుంటూరు: కొరిటెపాడు శ్రీ బాలసుబ్రహ్మణ్యేశ్వర భక్త జన సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి 47వ భరణి, కృత్తిక కావడి రథోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపు కొరిటెపాడులో ప్రారంభమై అరండల్‌పేట శ్రీ గంగా మీనాక్షీ సమేత సోమసుందరస్వామి దేవస్థానం వరకు వైభవంగా సాగింది. స్వామికి ప్రత్యేక అలంకరణ, నైవేద్యాలు, తీర్థప్రసాద వితరణ గావించారు. సాయంత్రం దేవతా వేషధారణలతో కళాకారుల నృత్యాలు, వాయిద్యాలతో కావడి రథోత్సవం అరండల్‌పేటలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సన్నిధానం వరకు వైభవంగా సాగింది. ఏర్పాట్లను సమితి సభ్యులు మేలపుడి కరుణానిధి, శివప్రసాద్, మురళీకృష్ణ, కస్తూరి శివకుమార్ పర్యవేక్షించారు.

ఆదివాసీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్



డాక్టర్ వైఎస్సార్, ఆదివాసీల ప్రముఖుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్యే ముస్తఫా, ఎమ్మెల్సీ రాజశేఖర్

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదివాసీలు, గిరిజనుల సంక్షేమం కోసం పాటుపడుతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్సీ, పార్టీ రీజనల్ కో– ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం వేడుకల్ని పార్టీ ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు మేడా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి, పలు గిరిజన ప్రముఖుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీలకు సంక్షేమం, అభివృద్ధి అందజేస్తున్న ఘనత సీఎం వై.ఎస్. జగన్‌కే దక్కుతోందని తెలిపారు. విద్య, వైద్యాన్ని వారి దరిచేరుస్తూ, సంస్కృతీ సంప్రదాయాల్ని కాపాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదివాసీలు, గిరిజనులకు అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మేరాజ్యోతు హనుమంత్ నాయక్, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, వైఎస్సార్ సీపీ నేతలు ముంతాజ్, బిక్కునాయక్, వెంకటసుబ్బయ్య, తోకల నరసింహారావు, గనిక ఝాన్సీ, పార్టీ నేతలు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు అండగా ఉంటాం

మేయర్ కావటి మనోహర్‌నాయుడు



అధికారులు, బ్యాంకర్లతో సమావేశమైన మేయర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో అవుట్ సోర్సింగ్ కార్మికులకు అండగా ఉంటామని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. సంపత్ నగర్‌లోని ఆయన క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆప్కాస్, బ్యాంక్, నగర పాలక సంస్థ అకౌంట్స్ అధికారులతో అవుట్ సోర్సింగ్ కార్మికులకు రుణ మంజూరుపై ప్రత్యేక సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై. ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆప్కాస్ ద్వారా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెలా జీతాలు అందేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఆయన స్ఫూర్తితో ఇప్పటికే బీమా సౌకర్యం కల్పించి, ప్రీమియం కూడా నగర పాలక సంస్థే చెల్లించేలా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. అవుట్ సోర్సింగ్ కార్మికులకు ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు అందేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. కార్మికులకు కుటుంబ అవసరాలు, పిల్లల చదువులు, ఆరోగ్య అవసరాలకు ఉపయోగపడేలా తక్కువ వడ్డీకి బ్యాంక్ రుణాలు ఇప్పించేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. బ్యాంకర్స్ కూడా కార్మికులకు రుణాలు ఇవ్వడానికి పెద్ద మనస్సుతో ముందుకు రావాలని ఆయన కోరారు. సమావేశంలో ఆప్కాస్ జనరల్ మేనేజర్ నాగ ప్రసాద్, హెచ్‌ఆర్ మేనేజర్ డేనియల్, యూనియన్ బ్యాంకు రీజినల్ సీనియర్ మేనేజర్ గోపీచంద్, హిందూ కాలేజీ బ్రాంచ్ మేనేజర్ త్రివేణి, నగరపాలక సంస్థ అకౌంటెంట్ రవి కిరణ్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈదులమూడి మధు బాబు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వాలు సహకరించాలి



నెహ్రూనగర్: రాష్ట్రంలో గిరిజనుల అభివృద్ధికి సహకరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆంధ్రప్రదేశ్ గిరిజన ఐక్య వేదిక కార్యదర్శి వి.ఎన్.ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నగరంపాలెంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరుకుల, మైదాన ప్రాంత గిరిజనుల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని కోరారు. సీనియర్ ఐఏఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కమిటీఏర్పాటు చేసి నకిలీ గిరిజన కుల ధ్రువీకరణ పత్రాల్ని గుర్తించి, వాటిని రద్దు చేయాలని విన్నవించారు. వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి కృషి చేయాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు కోటేశ్వరరావు, వీరాంజనేయులు, రాంబాబు, కోటయ్య పాల్గొన్నారు.

వార్డు వెల్ఫేర్ సెక్రటరీ కుటుంబానికి ఆర్థిక సాయం



నెహ్రూనగర్: గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలోని చౌడవరం 187వ వార్డు సచివాలయంలో వార్డు వెల్ఫేర్ సెక్రటరీగా పనిచేస్తున్న షేక్ హుస్సేన్ రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయన భార్య షేక్ నాగూర్‌బీకి నగరపాలక సంస్థ పరిధిలోని వార్డు వెల్ఫేర్ సెక్రటరీలంతా కలసి ఒక రోజు జీతాన్ని నగరపాలక సంస్థ మేనేజర్ శివన్నారాయణ సమక్షంలో అందజేశారు. ప్రభుత్వం పరంగా బాధితురాలికి బెనిఫిట్స్ ఇప్పించేందుకు తగిన చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సెక్రటరీలు కంచె నాగేశ్వరరావు, సంకూరి రాజారావు, ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

పట్నంబజారు: ఆన్‌లైన్‌లో వ్యక్తిని మోసం చేసిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత్తూరువారితోటకు చెందిన షేక్ ఖలీల్ రహమాన్ టెలిగ్రామ్ యాప్‌లో ఈడీ షాప్–7 అనే యాడ్ చూస్తూ లింక్ ఓపెన్ చేశాడు. తమ యాప్‌లో డబ్బులు జమ చేస్తే అధికంగా తిరిగి వస్తాయని చెప్పడంతో రూ. 1.57లక్షలు వేశాడు. అయితే, తిరిగి ఇవ్వకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సింగిల్ నంబరు లాటరీ ఆడుతున్న వ్యక్తుల అరెస్టు

సింగిల్ నంబరు లాటరీ ఆడుతున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మణి హోటల్ సెంటర్‌లో రహమతుల్లా సింగిల్ నంబరు లాటరీ ఆడిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న పాత గుంటూరు స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ బాషా దాడి చేసి పట్టుకున్నారు. ఈ సమయంలో గుట్టుచప్పుడు కాకుండా పక్కనే ఉన్న సంధ్యా బార్‌లో స్లిప్పులు రాయించి ఆట ఆడిస్తున్నట్లు గుర్తించారు. నలుగురిని అదుపులోకి తీసుకోవడంతోపాటు, వారి నుంచి రూ. 17వేలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు ఆయన తెలిపారు.

మహిళ ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: మహిళ ఆత్మహత్యపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. శాంతినగర్‌లోని అమృత టవర్స్‌లో నివాసం ఉండే శ్రీనివాసరావు భార్య సింధూర (35) అనారోగ్యంతో బాధపడుతోంది. మానసికంగా కృంగిపోయి ఇంట్లో ఎవరూ లేని సమయంలో బుధవారం ఫ్యానుకు చున్నీ వేసి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీనివాసరావుపేటలో ఎస్పీ పర్యటన



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

గుంటూరు ఈస్ట్: జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్ శ్రీనివాసరావుపేటలో అధికారులతో కలసి బుధవారం రాత్రి పర్యటించారు. 60 అడుగుల రోడ్డు, జెండా చెట్టు సెంటర్ తదితర ప్రాంతాల్లో స్థానికుల్ని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సత్వరమే వాటిని పరిష్కరించాలని ఎస్‌హెచ్‌వో హైమారావును ఆదేశించారు. స్టేషన్ పరిధిలోని ప్రధాన సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. రాత్రి విధులు నిర్వహించే సిబ్బంది, రక్షక్ వాహనాలతో పెట్రోలింగ్, నైట్‌బీట్ డ్యూటీ చేస్తున్న సిబ్బంది అనుమానాస్పదంగా పర్యటించే వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రధాన కూడళ్లలో పటిష్ట నిఘా ఉంచాలని తెలిపారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని సూచించారు. ఆయన ఎస్‌బీ సీఐ నరసింహారావు ఉన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు



పట్నంబజారు: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వో షేక్ అన్వర్‌బాషా హెచ్చరించారు. ప్రకాష్‌నగర్ పరిసర ప్రాంతాల్లో మహిళలతో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో మాట్లాడుతూ ప్రకాష్‌నగర్ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని సమాచారం ఉందని, ఇకపై అటువంటివి జరిగితే ఉపేక్షించమని తెలిపారు. జీవితాల్ని మార్చుకునేందుకు మహిళలు కష్టపడి పని చేసుకోవాలని సూచించారు. సమాజంలో గౌరవప్రదంగా జీవించేందుకు పోలీసుల నుంచి పూర్తి సహాయం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐలు ఎస్.శ్రీనివాసరావు, తరంగిణి, షేక్ ఎం.డి.మీరజ్, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: జూన్‌లో నిర్వహించిన బదిలీలు, ఉద్యోగోన్నతిపై వేర్వేరు పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ (ఏపీయూఎస్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ. బాలచంద్రారెడ్డి, కె. శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈవో పి.శైలజను బుధవారం కలసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ బదిలీ పొంది, రిలీవ్ కాని ఉపాధ్యాయులకు తక్షణమే రిలీవ్ చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. డీఈవోను కలసిన వారిలో సంఘ రాష్ట్ర కోశాధికారి మన్నవ సురేష్‌కుమార్, పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు ఉన్నారు.

రూ.25.50 లక్షల విలువైన 126 మొబైల్ ఫోన్లు అప్పగింత



ఫోన్ల అప్పగింతలో పాల్గొన్న జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, ఏఎస్పీలు సుప్రజ, శ్రీనివాసరావు

- జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్
- పోలీస్ వాట్సాప్ నంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నగరంపాలెం: రోజుల వ్యవధిలో సుమారు రూ.25.50 లక్షల విలువ చేసే వివిధ బ్రాండెడ్ కంపెనీల 126 మొబైల్ ఫోన్లను బాధితులకు అప్పగించినట్లు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. పోగొట్టుకున్న ఫోన్లను బాధితులకు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ కొద్ది నెలల కిందట అమల్లోకి తీసుకొచ్చిన పోలీస్ వాట్సాప్ నంబరు 8688831574కు విశేష ఆదరణ లభిస్తోందని తెలిపారు. ఆ నంబర్‌కు హాయ్ అని మెసేజ్ పంపిస్తే, తద్వారా పోగొట్టుకున్న ఫోన్లను సైబర్ క్రైం (ఐటీ కోర్) పోలీసులు గుర్తిస్తారని చెప్పారు.
సీఈఐఆర్ సిటిజన్ పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వెంటనే పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే, సెల్‌ఫోన్లలోని సమాచారం దుర్వినియోగంకాదని తెలిపారు. ఫోన్ కూడా బ్లాక్ అవుతుందని, పోగొట్టుకున్న ఫోన్‌ను త్వరితగతిన పట్టుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. వాట్సాప్ నంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. తమిళనాడు, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి అధిక మొత్తంలో సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో నోడల్ అధికారిణి, ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ, ఏఎస్పీ (క్రైం) ఎ.శ్రీనివాసరావు, ఐటీ కోర్ ఎస్ఐ శ్రీనాథ్, సిబ్బంది కరీముల్లా, రమేష్ పాల్గొన్నారు.

రూ.1.90 లక్షల ఫోన్ అప్పగించారు

నా పుట్టిన రోజు సందర్భంగా కొడుకు బహుమతిగా రూ.1.90 లక్షల ఖరీదు చేసే మొబైల్‌ఫోన్‌ను అందించాడు. తరువాత పోయింది. ఇక దొరకదని ఆశలు వదులుకున్నా. అయితే వాట్సాప్ నంబర్ తెలిసి, సంప్రదించా. ఈ క్రమంలో పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్‌ను అప్పగించడం ఆనందంగా ఉంది. జిల్లా ఎస్పీ, ఐటీ కోర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.

– వై.ఎస్.కె.ప్రసాద్, పాతకమూరు జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం, ప్రకాశం జిల్లా

ముందస్తు వైద్య పరీక్షలతో ఆరోగ్య పరిరక్షణ



వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్

గుంటూరు మెడికల్: వ్యాధులు వచ్చాక ఆసుపత్రుల చుట్టూ తిరగడం కంటే ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమమని అహల్య ట్రస్టు నిర్వాహకులు, ఐవీఎఫ్ స్పెషాలిటీ వైద్య నిపుణులు డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ సూచించారు. అహల్య ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మణి హోటల్ సెంటర్ బాలాజీనగర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు కూడా ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమాశంకర్ మాట్లాడుతూ అహల్య ట్రస్టు ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు, వైద్య అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటిదాకా లక్షలాది మంది ప్రజలకు ఆరోగ్య సేవలు అందించామని, తమ ట్రస్టు సేవల్ని కూడా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వైద్య శిబిరంలో ఆయనతో పాటు డాక్టర్ బలరామకృష్ణ పాల్గొన్నారు.

మానవాళి మనుగడకు మొక్కలే ఆధారం



మొక్కలతో ప్రిన్సిపాల్ కౌసల్యాదేవి, రాధామాధవి, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బీహెచ్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. కౌసల్యాదేవి పేర్కొన్నారు. బ్రాడీపేటలోని కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో నా దేశం–నా మట్టి కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈసందర్భంగా మానవాళి మనుగడకు మొక్కలే ఆధారం అనే అంశంపై విద్యార్థినులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఏ. రాధామాధవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు మాధవపెద్ది గిరిజ, కె. లక్ష్మీదీప్తి, అధ్యాపకులు పద్మజ, భారతి, పద్మావతి పాల్గొన్నారు.

నేషనల్ కిక్ బాక్సింగ్ ప్లేయర్‌కు ఆర్థిక సాయం



క్రీడాకారుడు పవన్‌కుమార్‌కు చెక్కును అందజేస్తున్న ధర్మచరణ్

కొరిటెపాడు: నంబూరు గ్రామానికి చెందిన నేషనల్ కిక్ బాక్సింగ్ క్రీడాకారుడు ప్రత్తి పవన్ కుమార్‌కు వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ రూ. 25వేల ఆర్థిక సాయాన్ని సోమవారం కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవంబర్ 17 నుంచి 27 వరకు పోర్చుగల్ దేశంలో జరగనున్న వరల్డ్ కిక్ బాక్సింగ్ చాపియన్‌షిప్‌లో మ్యూజికల్ ఫాం విభాగంలో పవన్ కుమార్ ఇండియా నుంచి ఎంపికయ్యాడన్నారు. ఈ నగదును అవసరాల నిమిత్తం ఇచ్చినట్లు వెల్లడించారు. రాబోవు వరల్డ్ కిక్ చాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్‌ను సాధించి, ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పవన్ కుమార్ తల్లిదండ్రులు, తోట రంగారావు పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు వీల్ చైర్స్ బహూకరణ



డాక్టర్ కిరణ్‌కుమార్‌కు వీల్‌చైర్స్ అందజేస్తున్న కమలకుమారి

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో ఎఫ్ఎన్‌వో (ఫిమేల్ నర్సింగ్ ఆర్డర్లీ)గా విధులు నిర్వహిస్తున్న ఆర్.కమలకుమారి బుధవారం ఆసుపత్రికి రూ. 10వేలు విలువ చేసే ఐదు వీల్‌చైర్‌లను బహూకరించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ కమలకుమారి పెద్ద మనస్సుతో ఆమె తల్లి జ్ఞాపకార్థం వీల్ చైర్స్ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్.శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ ఆర్.గాయత్రి, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్, బయో మెడికల్ ఇంజినీర్ కంచర్ల చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు వడ్డె బాలయ్య పాల్గొన్నారు.

నాట్కో ట్రస్టు సాయంతో డయాలసిస్ యూనిట్

జీజీహెచ్ నెఫ్రాలజీ వైద్య విభాగంలో కొత్తగా పది పడకల డయాలసిస్ విభాగాన్ని నాట్కోట్రస్టు సహాయంతో ఏర్పాటు చేయనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. బుధవారం నెఫ్రాలజీ వార్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసుపత్రిలో ఇప్పటి వరకు నెఫ్రో ప్లస్ ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యంలో డయాలసిస్ కేంద్రం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ప్రభుత్వమే నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తద్వారా పీజీ సీట్లు రావడానికి అవకాశం ఏర్పడుతోందని పేర్కొన్నారు. డీఎం నెఫ్రాలజీ కోర్సులు రావడానికి డయాలసిస్ యూనిట్ అవసరమని వెల్లడించారు.

త్వరలోనే కిడ్నీ మార్పిడి ఆపరేషన్

ఆరోగ్య శ్రీ పథకం ద్వారా గుంటూరు జీజీహెచ్‌లో త్వరలోనే కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు ప్రారంభిస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ చెప్పారు. ఆసుపత్రి నెఫ్రాలజీ వార్డుకు శివనాగేశ్వరరావు చికిత్స కోసం రాగా పరీక్షలు చేసి కిడ్నీలు దెబ్బతిన్నట్లు గుర్తించారన్నారు. రోగికి అవసరమైన కిడ్నీ ఇచ్చేందుకు తల్లి ముందుకు రావడంతో త్వరలో ఆపరేషన్ చేస్తామని తెలిపారు.

ఓబీసీల న్యాయమైన హక్కులను కాపాడాలి

గుంటూరు: దేశంలో సగానికి పైగా ఉన్న ఓబీసీల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికొదిలేశాయని సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట బుధవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ వేణుగోపాలరెడ్డికి వినతిపత్రం అందజేశారు.